ఆకాశవాణి  హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ:  28.11.2024                                   సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ప్రభుత్వ, గురుకుల పాఠశాలలు, వసతిగృహాలలో విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు.
2. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ ప్రభుత్వ గురుకులాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.
3. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనలో జరిగిన వైఫల్యాలపై బీజేపీ డిసెంబర్ 1 నుంచి 5వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు.
4. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అమలవుతున్న తీరును పరిశీలించడానికి హన్మకొండ జిల్లాలో కేంద్ర అధికారుల బృందం ఈరోజు పర్యటిస్తోంది.

----------------------

**REVANTH   REDDY ON HOSTELS FOOD**

ప్రభుత్వ, గురుకుల పాఠశాలలు, వసతిగృహాల విద్యార్థుల ఆహారం విషయంలో ఉదాశీనంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. విద్యార్థుల ఆహారం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు రుజువైతే వారిని ఉద్యోగాల నుంచి తొలగించేందుకు కూడా వెనుకాడేది లేదని ఆయన ఈరోజు స్పష్టం చేశారు. విద్యార్థుల ఆహారం విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని జిల్లా కలెక్టర్లకు సూచించారు. విద్యార్థుల ఆహారం విషయంలో ఇటీవల చోటు చేసుకుంటున్న ఘటనలపై ముఖ్యమంత్రి సమీక్షించారు. కలెక్టర్లు తరచూ ఆయా పాఠశాలలు, వసతిగృహాలను సందర్శించి, నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. విద్యార్థులకు మంచి విద్య అందించే ఉద్దేశంతో పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టడంతో పాటు వారికి పౌష్టికాహారం అందించేందుకు డైట్ ఛార్జీలు పెంచిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేశారు.

**MSL**

----------------------------

**PONNAM VIIST HOSTEL**

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రఖ్యాత ఎస్సి, ఎస్టీ ,బీసీ ,మైనార్టీ గురుకులాల్లో సౌకర్యాలు గతం కంటే మెరుగైన విధంగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ రోజు సిద్ధిపేట లోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించటంలో ఏదైనా లోపాలు ఉంటే అధికారులపై చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. పాఠశాల ఆవరణలో ,

బాత్రూమ్స్, వంటగదులను పరిశీలించారు. ఆహారం అందించటంలో ఎలాంటి లోపం లేకుండా చూసుకోవాలని.... మెస్ చార్జీలు & కాస్మొటిక్ చార్జీలు పెంచామని, ఆహార నాణ్యత లో లోటు ఉంటే చర్యలుతీసుకుంటామని మంత్రి అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదువుకోవాలని ... ఎస్సి, ఎస్టీ ,బీసీ మైనారిటీ ల పాఠశాలలలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

**PTC SDP**

----------------------

**NLG COLLECTOR VISIT HOSTELS**

రెసిడెన్షియల్ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు ,పాఠశాలల్లో వంటగదులను శుభ్రంగా ఉంచాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. మునుగోడు మండలం లోని పలు గ్రామాలలో రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్లను ఆమె తనిఖీ చేశారు.

**PTC NLG**

-----------------------

**KISHAN REDDY ON CONG GOVT**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలన లో జరిగిన వైఫల్యాలపై డిసెంబర్ 1 నుంచి 5వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. ఆయన నిన్న ఢిల్లీలో మాట్లాడుతూ.... ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయకుండా గత నెలరోజులుగా ప్రజాపాలన విజయోత్సవాలను నిర్వహిస్తోందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో సమస్యలపై మాట్లాడితే ముఖ్యమంత్రి వ్యక్తిగతంగా దాడి

చేస్తున్నారని.....మాజీ ముఖ్యమంత్రి కే. చంద్ర శేఖర రావు తరహాలోనే రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని  ఆరోపించారు. విపక్షాలను దుయ్యబట్టే కంటే మంత్రులు పాలన మీద దృష్టిపెడితే బాగుంటుందని కిషన్ రెడ్డి హితవు పలికారు.  గత ఏడాది కాలంలో కాంగ్రెస్ పార్టీ  బెదిరింపులు, విపక్షాలను  తిట్టటం, వ్యక్తిగత దాడులు, అక్రమ కేసులు, తప్ప  ఈ సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ సాధించిందేమీ లేదని కిషన్ రెడ్డి అన్నారు.

**MSL**

------------------------

**PAR-ADJOURNED**

విపక్షాల ఆందోళనల మధ్య ఉభయ సభలు  రేపటికి వాయిదా పడ్డాయి. ఈ ఉదయం లోక్‌సభ సమావేశమైనప్పుడు, కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, డిఎంకె ఇతరులతో సహా ప్రతిపక్ష పార్టీలు ఒక ప్రముఖ వ్యాపార సంస్థపై చేసిన లంచం ఆరోపణలతో సహా వివిధ అంశాలపై గందరగోళం సృష్టించాయి. సభ 12 గంటలకు తిరిగి సమావేశం అయినప్పటికీ ప్రతిపక్షాల గందరగోళం కొనసాగటంతో  స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాల సమయాన్ని చేపట్టేందుకు ప్రయత్నించగా ...ఫలితం లేకపోవడంతో సభను రేపటికి వాయిదా వేశారు.  అంతకుముందు, ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా, రవీంద్ర వసంతరావు చవాన్‌లు లోక్‌సభలో పార్లమెంటు సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు.

రాజ్యసభలో కూడా ఇదే పరిస్థితి ఏర్పడటంతో ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. సభ తిరిగి 12 గంటలకు

సమావేశమైనప్పటికీ, ప్రతిపక్ష సభ్యులు ఆందోళన చేస్తుండటంతో ఛైర్మన్ సభను రేపటికి వాయిదా వేశారు.

**NSD**

----------------------------

**NRML ITHANAL PROJECT**

నిర్మల్ జిల్లా దిలావర్పూర్ మండలంలోని ఇతనాల్ ప్రాజెక్టును ప్రభుత్వం నిలిపివేసిందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఈ రోజు తెలిపారు. దీనిపై సామాజిక మాధ్యమంలో తప్పుడు సమాచారం చేసినట్లయితే చట్ట ప్రకారం వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు

**PTC NRML**

----------------------------

**SRIDHAR BABU BALGERIA**

తెలంగాణ రాష్ట్రంతో వాణిజ్య, సాంస్కృతిక రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలు నెలకొల్పేందుకు బల్గేరియా ఆసక్తితో ఉందని భారత్‌లో ఆ దేశ రాయబారి డాక్టర నికోలాయ్ యాంకోవ్ అన్నారు. ఆయన నిన్న తన బృందంతో కలిసి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా రాయభారి డాక్టర్ నికోలాయ్ మాట్లాడుతూ.... ఇరు దేశాల మధ్య వాణిజ్య, పారిశ్రామిక పెట్టుబడులకు సంబంధించి ఒక ఉమ్మడి వేదిక ఏర్పాటు చేయాలని కోరాగా మంత్రి ఆ ప్రతిపాదనకు అంగీకరించారు. నూతన ఆవిష్కరణలు, ఫార్మా, లైఫ్ సైన్సెస్‌లో రాష్ట్రంలో అద్భుతమైన ఎకోసిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు మంత్రి డాక్టర్ నికోలాయ్‌కు వివరించారు.

**DESK**

----------------------------

**వరంగల్**

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అమలవుతున్న తీరును హన్మకొండ జిల్లాలో కేంద్ర బృందం ఈరోజు పరిశీలిస్తోంది. జిల్లాలోని ధర్మసాగర్ మండలంలోని సంపద వనాలను, మిషన్ భగీరథ నీటి శుద్ధిని తాగునీటి సరఫరాను పరిశీలించిన అధికారుల బృందం ధర్మసాగర్ రిజర్వాయర్ ను సందర్శించి అక్కడ వివరాలు తెలుసుకున్నారు. తాటికాయల గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మితమైన పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించి సంతృప్తిని వ్యక్తం చేశారు, స్వయం సహాయక గ్రూపులతో సమావేశమై వారి పని విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల అమలు తీరు హనుమకొండ జిల్లాలో బాగుందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు.

**పిటిసి వరంగల్**

---------------------------------

**TUMMALA ON RUNA MAFEE**

వివిధ కారణాలతో రుణమాఫీ జరగని 3 లక్షల మందికి పైగా రైతుల ఖాతాల్లో ఈనెల 30 న డబ్బులు జమ చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. ఆయన నిన్న రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో జరిగిన వ్యవసాయ మార్కె కమిటీ కార్యక్రమంలో మాట్లాడుతూ... ఈనెల 30న పాలమూరులో జరగనున్న రైతుపండగ సందర్భంగా రుణ మాఫీ చేస్తామని తెలిపారు.

**PTC,RR**

-------------------------------

**BHATTI VIKRAMARKA ON CHRISTMAS**

రాష్ట్రంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఆయన నిన్న ప్రజా భవన్‌లో క్రిస్మస్ వేడుకల కమిటీ సభ్యులు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని 200 ప్రాంతాలు, 95 అసెంబ్లీ నియోజకవర్గాల్లో రాష్ట్ర ప్రభుత్వం తరపున క్రిస్మస్ ఉత్సవాలు నిర్వహించనున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. ఇందుకు జీహెచ్‌ఎంసీతో పాటు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కమిటీలు వేయాలని ఆయన అధికారులకు సూచించారు.

**PTC, HYD**

---------------------

**CHRISTMAN YDD BNG**

క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని పలు రంగాల్లో విశిష్ట సేవలందించిన క్రైస్తవులు తమ నామినేషన్లను వచ్చే నెల 5వ తేదీ లోపు ఆన్లైన్‌లో సమర్పించాలని యాదాద్రి భువనగిరి జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి యాదయ్య ఓ ప్రకటనలో తెలిపారు.

**PTC YDD BNG**

------------------------------

**TS COLD WAVES**

బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం కారణంగా తెలంగాణలోని పలు ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోయాయి. ఆదిలాబాద్ జిల్లా ఆర్లి, కోమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో ఈ రోజు ఉదయం అత్యల్పంగా 9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో 10 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

**MSL**

----------------------------------